క్లుప్తంగా

8న ఆన్‌లైన్‌లో క్రీడాజ్ఞాన్ పరీక్ష

మదనపల్లె సిటీ: క్రీడాజ్ఞాన్ పరీక్ష ఈనెల 8వతేదీన నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, క్రీడాభారతి అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, నరేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీడాజ్ఞాన్ పరీక్ష ఆన్‌లైన్‌లో రాయాలన్నారు. క్రీడాకారులు, క్రీడలపై అవగాహన ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పరీక్ష రాయాలన్నారు. 12 సంవత్సరాలు పైబడిన బాల బాలికలు ఎవరైనా రాయవచ్చునన్నారు. ఇందులో మొదటి అవార్డు విజేతకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు ఇద్దరికి, తృతీయ అవార్డు రూ.25 వేలు ఆరు మందికి, నాల్గవ బహుమతి రూ.11 వేలు 11 మందికి ఒక రీజియన్ తరపున ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 6281881022, 9885055402ను సంప్రదించాలన్నారు.

ఉల్లాస్‌పై నేడు శిక్షణ

పీలేరురూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే శిక్షణ కార్యక్రమానికి వలంటీర్ టీచర్లు, వీవోఏలు హాజరు కావాలని కోరారు.

పెద్దతిప్పసముద్రం: వయోజన విద్యలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

'ప్రమాద స్థలాల్లో ఉండొద్దు'

కలకడ : ప్రమాద స్థలాల వద్ద నివాసం ఉన్నవారు సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ పనికుమార్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా పూరి గుడిసెలు లేవని, ఉన్నా వాటిలో ఉండరాదన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు, షాక్‌లు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌ఓలతో మాట్లాడి గ్రామాల వారి నివేదికలు అందించాలని ఆదేశించారు. చెరువులు, కుంటల్లోకి ఎలాంటి అదనపు వర్షపు నీరు చేరలేదన్నారు. పంట నష్టం జరిగితే అంచనాలు సిద్ధం చేయడానికి సాగువివరాలను నమోదు చేయాలని సిబ్బందిని దేశించారు.

జేసీబీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన ఎల్లయ్య

కురబలకోట: మండలంలోని అంగళ్లు కొత్త బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన జేసీబీ డ్రైవర్ ఎల్లయ్య (39) సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. అంగళ్లు సమీపంలో జేసీబీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం కోసం అంగళ్లుకు వెళ్లి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి

పీలేరు : ఈ నెల 4న తిరుపతిలో నిర్వహించనున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ సమీక్షా సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన నాయకత్వాన్ని బలోపేతం చేయుటకు జిల్లాల వారిగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు సురేష్‌మాదిగ హాజరవుతారని తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం

– వీధిలోకి దూసుకెళ్లిన లారీ

బి.కొత్తకోట: రహదారిగా భావించి వీధిలోకి లారీ దూసుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో బి.కొత్తకోటలో చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి వచ్చిన లారీ మదనపల్లె వైపు వెళ్తూ పట్టణంలోని మలుపు వద్ద తిప్పుకొని వెళ్లాల్సి ఉంది. అయితే డ్రైవర్ లారీని ఎదురుగా ఉన్న వీధిలోకి తీసుకెళ్లడంతో స్తంభాలు, నీటి కొళాయి దిమ్మెలు, దుకాణాల దిమ్మెలు ధ్వంసం అయ్యాయి. ఆ సమయంలో వర్షం కురుస్తూ జన సంచారం లేకపోవడంతో, వ్యాపారాలు మూత పడటంతో ప్రాణాపాయం తప్పింది.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : ఈనెల 4వ తేదీన విజయవాడలో నిర్వహింప తలపెట్టిన ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌పార్టీ జిల్లానేత మావులూరి విశ్వనాథ కోరారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రజాహక్కుల సభ పోస్టర్లను ఆయన పార్టీ నేతలతో కలసి విడుదల చేశారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జరుపుతున్న ప్రజాహక్కుల సభను అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విచారణతో అవినీతి డొంక కదిలేనా..?

- ఎంపీ మిథున్ రెడ్డి ఫిర్యాదుతో అధికారుల్లో గుబులు
- నాలుగు బృందాలతో విచారణకు ఆదేశం


మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లి వద్ద యంత్రాలు చేసినట్లు దర్శనమిస్తున్న ఫాంపాండ్

కలికిరి: ఉపాధి హామీ పథకంలో భారీ స్థాయిలో అవకతవకలు చోటు చేసుకున్నాయని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి స్పందించి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గత నెలలో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎంజీఎన్ఆర్ఈజీ విభాగం) అధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు కలికిరి మండల పరిధిలో ఉపాధి నిధుల దుర్వినియోగం, నకిలీ జాబ్ కార్డుల సృష్టి, స్కీమ్ మార్గదర్శకాలను ఉల్లంగించి మ్యాన్ డేస్ స్థానంలో యంత్రాల ద్వారా ఫిష్ ఫాండ్, ఫాంపాండ్ పనులు చేపట్టినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి కేంద్ర స్థాయి బృందంతో విచారణ జరిపించాలని ఎంపీ లేఖలో కోరారు. ఈ విషయమై స్పందించిన కేంద్ర ప్రభుత్వం స్పందించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పిఆర్అండ్ఆర్‌డీ డైరెక్టరును ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టరు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ మునిరత్నం నలుగురు క్లస్టర్ ఏపీడీలతో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో నాలుగు బృందాలను విచారణ నిమిత్తం ఏర్పాటు చేశారు. అద్దవారిపల్లి, చీకటిపల్లి, గుండ్లూరు, గుట్టపాళెం గ్రామాలకు రాజంపేట క్లస్టర్ ఏపీడీ ప్రతాప్ బృందం, కలికిరి, మర్రికుంటపల్లి, మేడికుర్తి, మునెళ్ళపల్లి గ్రామాలకు రాయచోటి క్లస్టర్ ఏపీడీ లక్ష్మీనరసయ్య బృందం, పారపట్ల, పత్తేగడ, టి.సంద్రావారిపల్లి గ్రామాలకు కలికిరి క్లస్టర్ ఏపీడీ ఎస్.శ్రీనివాసులు బృందం, మొర్రంకిందపల్లి, మహల్, పల్లవోలు గ్రామాలకు తంబళ్ళపల్లి క్లస్టర్ ఏపీడీ ఎస్.మధుబాబు బృందాన్ని నియమిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో బృందంలో ఏపీడీతో పాటు ఏపీఓ, ఈసీ, టీఏ, సూపర్వైజర్ మొత్తం ఐదుగురు సభ్యులున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జరిగిన ఉపాధి పనులపై సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నారు.

అవినీతి వ్యవహారంపై విచారణ జరపాలి

- ఎమ్మెల్యే, ఎమ్మార్వో వివాదంపై వాస్తవాలు నిగ్గుతేల్చాలి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మదనపల్లె : నియోజకవర్గంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఎమ్మెల్యే, ఎమ్మార్వో అవినీతి ఆరోపణల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..అధికార పార్టీ ఎమ్మెల్యే షాజహాన్ బాషాపై, మండల మేజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ ఖాజాబీ నేరుగా ముఖ్యమంత్రి, రెవెన్యూ, ఐటీ మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిందంటే, కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఓ మహిళా అధికారి తనను విధులకు రానీయకుండా ఎమ్మెల్యే బెదిరిస్తున్నాడని పేర్కొనడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే, ఎమ్మార్వోలు పరస్పరం ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడంపై ప్రజల్లో అనేక అనుమానాలు తలెత్తి గందరగోళ పరిస్థితి నెలకుందన్నారు. ఇరువురి మధ్య ఉన్న అవినీతి వ్యవహారంపై రాష్ట్రప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థల్లోనూ అవినీతి పెచ్చుమీరి, పతాకస్థాయికి చేరుకుందని, సామాన్య ప్రజలు తమ అవసరాల కోసం లంచాలు ఇచ్చి పనిచేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆరునెలలకే ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, పారదర్శక పాలనను అందించి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చిన జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తు చేసుకుంటున్నారన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో టెక్‌ఫెస్ట్-2024

కలికిరి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5, 6 తేదీలలో రీజినల్ పాలిటెక్ ఫెస్ట్-2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెస్ట్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 344 మంది విద్యార్థులు హాజరవుతారని, కలికిరి పరిధిలోని ఉన్నత పాఠశాలల నుంచి 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

దాసార్లపల్లెలో పైప్‌లైన్ మరమ్మతులు


తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు చేస్తున్న సర్పంచ్

రామసముద్రం : మండలంలోని ఎలవానెల్లూరు పంచాయతీ దాసార్లపల్లెలో సర్పంచ్ ఉదయ్‌శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల పైప్‌లైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతుండటంతో గ్రామస్తులకు తాగునీరు లేకుండా పోయింది. దీంతో సర్పంచ్, గ్రామప్రజల ఫిర్యాదు మేరకు పైప్‌లైన్ మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టి యథావిధిగా గ్రామానికి నీటిని అందించడంతో ప్రజలు అభినందనలు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై నిర్మానుష్యం


సందర్శకులులేక బోసిపోయిన హార్సిలీహిల్స్ రోడ్లు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై సోమవారం నిర్మానుష్యం నెలకొంది. నిత్యం పర్యాటకులతో సందడిగా కనిపించే కొండపై వర్షం, మంచు అధికంగా కురుస్తూ మేఘాలు కమ్మేయడంతో సందర్శకులు చలికి భరించలేక రావడం లేదు. కొండపై విధులు నిర్వహించే టూరిజం, అటవీశాఖల సిబ్బంది, స్థానికులు మినహాయిస్తే సందర్శకులు లేరు. దీనితో కొండపై రోడ్లు, ప్రకృతి అందాలను వీక్షించే ప్రాంతాలు బోసిపోయాయి. సాధారణ వాతావరణం నెలకొనేదాక సందర్శకుల రాకకు బ్రేక్ పడినట్టే.

జాతీయస్థాయి పోటీలకు గుర్రంకొండ విద్యార్థులు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెడ్మాస్టర్ తదితరులు

గుర్రంకొండ: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర సోమవారం తెలిపారు. స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న హరినాథరెడ్డి, జసీమ్‌లు ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్రజట్టుకు వారు ఎంపికయ్యారు. బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఈనెల 18 తేదీన నిర్వహించే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో సోమవారం హైస్కూల్లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థులను హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ చింతిర్ల రమేష్, ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర, ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, జావీద్, రెడ్డిమోహన్, మదన్మోహన్ అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి పూర్తి సహకారం



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌పీ లీనెండ్‌ముఖర్జీ

తంబళ్లపల్లె: మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్‌లీవుడ్ మిషన్) ద్వారా పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఎన్ఆర్‌పి లీనెండ్‌ముఖర్జీ తెలిపారు. సోమవారం స్త్రీశక్తిభవన్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో ఎస్‌వీఈపీ డీపీఆర్ నివేదికల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే సీఆర్‌పీల ద్వారా ఎస్‌వీఈపీ ద్వారా మహిళల ఆర్థిక స్థితిగతులు వారు చేపట్టదలచిన చిన్న చిన్న వ్యాపారాలు, చిరు వ్యాపారాలు, కులవృత్తులపై సర్వే నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. ఆ నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించి డీపీఆర్ నివేదికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగం, తిరిగి చెల్లింపులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. మహిళలు పొదుపులు వినియోగించడంలో జిల్లాలో రెండో స్థానం నిలిచిందన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శేఖర్, డిపిఎంఎల్‌హెచ్ గంగార్జున, నియోజకవర్గంలోని ఏపిఎం, సీసీలు, ఓబిలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలి


తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న సర్వేయర్లు

పీలేరు : బయోమెట్రిక్ విధానం నుంచి గ్రామ సర్వేయర్లకు మినహాయింపు ఇవ్వాలని సోమవారం సర్వేయర్లు తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సభలలో స్వీకరించిన అర్జీల పరిష్కారం కోసం, రీసర్వే హద్దు రాళ్ళపై పేర్లు చెరిపేందుకు సమయం సరిపోదని, పని ఒత్తిడి ఎక్కువగా ఉండడం వలన బయోమెట్రిక్ వేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలికిరి: వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వర్షాల సమయం, వాతావరణ మార్పుల వలన జల్లులకు తడవడంతో కలుషిత మేత, తాటినీటి వలన పశువులు ఒత్తిడికి గురై రోగ నిరోధక శక్తి రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున రైతులు ముందసు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని, బలహీనమైన పాకలు, చెట్లకింద, విద్యుత్ స్తంభాలకు కట్టేయకూడదని తెలిపారు. గొర్రెలు, మేకలను నది పరివాహక ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రాంతాల్లో మేపుకోవాలని సూచించారు. తుపాను అనంతరం అన్ని పశువులకు నట్టల నివారణ మందులను తాగించాలన్నారు. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కరాటేలో పీలేరు విద్యార్థుల ప్రతిభ


కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు

పీలేరు : రేణిగుంటలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే టోర్నమెంట్‌లో పీలేరుకు చెందిన యోదా మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు కారాటే మాస్టర్ ఇనామిల్ హక్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అండర్- 14 విభాగంలో ముదిత్ సాయి ప్రథమస్థానం, ఫరూక్ మూడవ స్థానం సాధించినట్లు చెప్పారు. అండర్ -11 విభాగంలో కన్విక, అండర్- 15 విభాగంలో హితేష్, ఫైట్‌లో వికాస్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

ఎన్నికల హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : కూటమిప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావస్తున్నా అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, వలంటీర్లు, భవననిర్మాణ కార్మికులు, ఆటోవర్కర్స్‌కు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం కనపరుస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ...ఇది మంచి ప్రభుత్వం అని ఇంటింటికీ స్టిక్కర్స్ అంటిస్తే, మంచి ప్రభుత్వం అయిపోదన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అంగన్‌వాడీ, భవననిర్మాణ కార్మికులు, ఆశావర్కర్స్, ఆటోడ్రైవర్లు రోడ్డుమీదకు వచ్చి ఎన్నికల హామీల అమలుపై ఆందోళనలు చేస్తున్నారన్నారు. డిసెంబర్ 12న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు అంగన్‌వాడీలు సిద్ధమయ్యారన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లకు ఇచ్చిన హామీ ప్రకారం గౌరవవేతనం రూ.10వేలు ఇవ్వాలని, విధులు కేటాయించాలన్నారు. ఆటోవర్కర్స్‌కు ఇబ్బంది కలిగించే 21, 31 జీఓ రద్దుచేయాలన్నారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దేవా, తిరుమల, మురళి, వెంకటరమణ, ఇక్బాల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ క్రిష్ణవేణి

మదనపల్లె సిటీ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ టు టౌన్ ఎస్ఐ రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై ఎన్ఎస్ఎస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. ఎవరైనా అనుమానాలు వస్తే సమీపంలోని పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలన్నారు. సోషియల్ మీడియా వాడకం ఎక్కువైనట్లు తెలిపారు. సోషియల్ మీడియా వినియోగించేటప్పుడు విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930ను వాడాలని సూచించారు. మోటివేటర్ రామమూర్తి విద్యార్థినులు ముఖ్యంగా అమ్మాయిలు సామాజిక ప్రవర్తన, సోషియల్ మీడియా వినియోగం అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, అధ్యాపకులు వనజ, జ్యోతి, మోహన్‌వల్లి, విష్ణుప్రియ, కుసుమకుమారి, గురుమూర్తి, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించండి


వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఐవో ఉషశ్రీ

పీలేరు రూరల్ : సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉషశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక సైనిక్ నగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, నవజాతి శిశువులు, వృద్ధులను, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారికి ఆరోగ్య మెలకవులు తెలపాలన్నారు. వెచ్చటి వాతావరణ, పరిసరాల శుభ్రత, సురక్షిత నీరు, శిశువుకి ఆరు నెలల వరకు తల్లిపాలు, తాజా పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రసన్న, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎంలు భార్గవి, ప్రమీలకుమారి, సీహెచ్‌వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నిండుతున్న చెరువులు


బడికాయలపల్లె చెరువులోకి ప్రవహిస్తున్న నీళ్లు

బి.కొత్తకోట: తుపాను ప్రభావంతో మండలంలోని చెరువులు నిండి ప్రవహిస్తున్నాయి. గట్టు, సూరపువారిపల్లె పంచాయతీల్లోని ఎగువ చెరువు, దిగువ చెరువు, సుద్దకుంట, పిన్నమచెరువు, అంతరమ్మ చెరువు, కనికలకుంట చెరువులు నిండటంతో దిగువకు ఉధృతంగా నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఈ నీళ్లన్ని బడికాయపల్లె పెద్దచెరువులోకి చేరుతున్నాయి. ఆదివారం 15.4 మిమీ, సోమవారం 27.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలంలోని వాగులు, వంకలు ప్రవహిస్తూ చెరువుల్లోకి నీళ్లు చేరుతున్నాయి.

వైభవంగా అయ్యప్ప గ్రామోత్సవం


ట్రాక్టర్‌పై అయ్యప్పస్వామి ఊరేగింపు

కలికిరి: మండల పరిధిలోని అయ్యప్ప భక్తులు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పుష్పాలంకరణ వాహనంలో ఏర్పాటు చేసి పుర వీధులలో అయ్యప్ప భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి క్రాస్ రోడ్ వరకు గ్రామోత్సవం సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అంబలం పూజ

మదనపల్లె సిటీ: స్థానిక మణికంఠ నగర్‌లో సోమవారం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి అంబలం పూజ మహేష్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. అరటిపిలకలు, పూలతో 18 మెట్లతో అందంగా అలంకరించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయ్యప్పమాలాధారులు స్వామి పాటలతో భజన చేశారు. స్వామికి అర్చకులు కార్తీక్ దీక్షిత్ అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలాధారులకు అన్నప్రసాద వితరణ చేశారు. అంబలం పూజకు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. నీట మునిగిన పంటలు

- వరి పంటకు భారీగా నష్టం
- టమాటా రైతుకు తప్పని ఇబ్బందులు
- మదనపల్లె డివిజన్‌లో 855 హెక్టార్ల పంటనష్టమని ప్రాథమిక అంచనా
- నిమ్మనపల్లెలో 53.2 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదు


సందిరెడ్డిపల్లెలో నేలకొరిగిన వరిపైరు


గుర్రంకొండలో వర్షాలకు దెబ్బతిన్న టమాటా తోట

మదనపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపానుతో...మూడురోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి పంటపొలాలు నీటమునిగాయి. కోతకొచ్చిన వరిపైరు బలంగా వీస్తున్న ఈదురుగాలులకు నేలకొరిగింది. పొల్లాల్లో నీటినిల్వలు నిలిచిపోవడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను దెబ్బకు వాలిన వరిపైరును యంత్రాలతో కోయడం సాధ్యపడదు కనుక, కూలీలతో పంటనూర్పిడి చేయించే పరిస్థితి ఉండటంతో రైతులకు ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. వరుసగా కురిసిన వర్షాలతో మూగజీవాలు తిండి లేక ఆకలితో అలమటించాయి. పట్టణంలోని శివారుప్రాంతాల్లోని కాలనీల రోడ్లు బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వర్షాలకు వ్యాపారాలు మందకొడిగా సాగాయి. చలిగాలులకు, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాలేదు. తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులు జీవనోపాధి కోల్పోయారు. మదనపల్లె డివిజన్‌లో 855 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సోమవారం మదనపల్లె మండలంలోని సందిరెడ్డిపల్లె, కొత్తపల్లె, చీకలబైలు, నిమ్మనపల్లె మండలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటపొలాలను పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షం మరో రెండురోజులు ఇలాగే కొనసాగితే, వరిపైరు మొలకలు వచ్చే అవకాశం ఉన్నందున పంట పొలాల్లోని నీరు వెలుపలికి పంపేందుకు కాలువలు ఏర్పాటుచేసి తొలగించాలన్నారు. ఎండ వచ్చిన తర్వాత వరి పొలంలో లీటరు నీటికి 50గ్రాముల ఉప్పును కలిపి పంటపై పిచికారీ చేస్తే మొలకలు రాకుండా ఉంటుందన్నారు.

వర్షపాతం వివరాలు

మదనపల్లె డివిజన్‌లో ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం వరకు ...నిమ్మనపల్లె మండలంలో అత్యధికంగా 53.2 మి.మీ. వర్షపాతం కురిసింది. మదనపల్లె 25, కురబలకోట 39.8, బి.కొత్తకోట 27.2, తంబళ్లపల్లె 42.8, పీటీఎం 22.6, ములకలచెరువు 26.4, పెద్దమండ్యం 39.6, కలికిరి 30.2, వాల్మీకిపురం 32.8, రామసముద్రం 14.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నిమ్మనపల్లె : మూడురోజులుగా ఫెంగల్ తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ ఆదేశాలతో అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఆయా సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. మండలంలో దాదాపుగా 265 హెక్టార్లలో వర్షం కారణంగా వరిపంట నేలవాలినట్లు అధికారులు గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

పీలేరు రూరల్ : తుపాను ప్రభావంతో మండలంలో స్వల్పంగా వరిపంట దెబ్బతిన్నట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. సోమవారం మండలంలోని ముడుపులవేముల పంచాయతీలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బి. శ్యామలమ్మకు చెందిన ఎకరా వరి, సుధాకర్‌కు అర ఎకరా వరిపంట నష్టం జరిగినట్లు తెలిపారు.

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. టమాటా, వరి, పూలతోటలు బాగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె గ్రామాల్లో టమాటా పంటలు దెబ్బతిన్నాయి. టి.పసలవాండ్లపల్లెలో కోతకొచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి.